క్లుప్తంగా

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు వద్ద కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. చింతూరు సర్పంచ్ బుల్లేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం..మంగపేట మండల పరిధిలోని కోమటిపల్లికి చెందిన ఇద్దరు యువకులు వాజేడు మండలంలోని బంధువుల ఇళ్లకు శుభకార్యానికి సంబంధించిన పత్రికలు ఇవ్వడానికి బైక్‌పై వస్తున్నారు. చెరుకూరు వద్దకు రాగానే చింతూరు జీపీ కార్యదర్శి కారులో అటునుంచి వాజేడు వస్తున్నాడు. కారు, బైక్ ఎదురెదురుగా ఉన్న సమయంలో ఘటనా స్థలంలో ఆపి ఉన్న బొలేరు వాహనాన్ని ఒక్కసారిగా డ్రైవర్ ముందుకు రానివ్వడంతో ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న యువకులు కింద పడిపోగా సందీప్‌కు గాయాలయ్యాయి. వీరిని 108లో ఏటూరునాగారం అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. కాగా త్వరలోనే సందీప్ పెళ్లి ఉన్నట్లు బుల్లేశ్వరావు తెలిపాడు.

నూతన కమిటీ ఎన్నిక


నాగరాజు


సందీప్

వాజేడు: నవ నిర్మాణ సేన మండల నూతన కమిటీని ఆదివారం ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మొడెం నాగరాజు, ఉపాధ్యక్షుడిగా సందీప్, ముఖ్య సలహాదారులుగా మొడెం జగన్నాథం, సంపత్, కార్యదర్శిగా పూనెం భాస్కర్, సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్, అఖిల్, నిఖిల్, ప్రశాంత్, రాజేందర్, సురేష్, రాజులను ఎన్నుకున్నారు.

టీకాలు వేయించాలి

భూపాలపల్లి రూరల్: పశువులు, ఆవులు, గేదెలకు గొంతు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని భూపాలపల్లి మండల పశు వైద్యాధికారి తిరుపతి రైతులను కోరారు. ఆదివారం మండలంలోని గుడాడ్‌పల్లి గ్రామంలో గేదెలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉడుత లక్ష్మి ఐలయ్య, గ్రామస్తులు, పశువుల యాజమానులు పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవాలి



భూపాలపల్లి రూరల్: పురాతనమైన కళలను కాపాడుకోవాలని, కళాకారులను ఆదరించాలని పద్మశాలి కుల పెద్దలు తుల శ్రీనివాస్, చిరురాల మల్లయ్య అన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని జంగేడు గ్రామంలో సాధన సూరులు కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కుల పెద్దలు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పద్మశాలి ఉప కులమైన సాధనసూరుల వారి ప్రదర్శనను ఈ తరంతో పాటు రాబోయే తరానికి గుర్తుండేలా గంజి శంకరయ్య గంజి పరంధామయ్యల కళాబృందం కళలను ప్రదర్శించారన్నారు. పద్మశాలీల ఐక్యతను పటిష్ట పరిచేందుకు పూరాతన ఆచారాలను కట్టుబాట్లను గుర్తుచేసేందుకు సాధన సూరుల కృషి చేయడం అభినందనీయమన్నారు. మార్కండేయ పరపతి సంఘం అధ్వర్యంలో సాధన సూరులను సన్మానించారు. ఈ ప్రదర్శనలో కుల సంఘం నాయకులు కందకట్ల రాజు, కుమారస్వామి, మార్కండేయ, నర్సింగరావు, మల్లయ్య, రాయమల్లు, సామల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

భూపాలపల్లి అర్బన్: సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎల్‌బీనగర్ మూడో లైన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వాటిని ఆదివారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. గతంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై కాలనీ ప్రజలకు అవగహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దీంతో కాలనీ వాసులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలు నిరోధించవచ్చన్నారు. పట్టణంలోని అన్ని కాలనీల ప్రజలు ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై స్వప్నకుమారి, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

మట్టి అక్రమదందా..

● అధికారులకు కాసుల పంట

మంగపేట: మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న మట్టి దందా కొందరు రెవెన్యూ అధికారులకు కాసుల పంటగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కమలాపురం, మంగపేట, మల్లూరు, రాజుపేట తదితర గ్రామాల్లో యంత్రాలతో మట్టి తవ్వకాలు జరుపుతూ టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తూ.. గోదావరిలో ఇసుక క్వారీలకు రోడ్లు నిర్మిస్తున్నారు. దీంతోపాటు వివిధ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, సాగుభూముల్లో మట్టిని నింపి ఇళ్ల ప్లాట్లుగా మార్చుతున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో 1/70, ఎల్టీఆర్ చట్టం అమలులో ఉండగా సాగు భూముల్లో నాలా కన్వర్షన్ అనుమతి లేకుండా వ్యవసాయేతర భూములుగా ఎలా మార్చుతారని నూతనంగా ఇళ్లు నిర్మించేవారికి, ప్లాట్లుగా మార్చే యజమానులకు ఎలాంటి నిర్మాణం పనులు చేపట్టొద్దని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. 1/70, ఎల్టీఆర్ చట్టం పేరుతో నోటీసులు జారీ చేసిన అధికారులు చట్టాలకు విరుద్ధంగా మండలంలోని గంపోనిగూడెం, చుంచుపల్లి, అకినేపల్లిమల్లారం ఇసుక క్వారీ నిర్వాహకులకు గోదావరిలో రోడ్లు నిర్మించేందుకు మట్టిని తరలించుకునేందుకు అనుమతులు ఇవ్వడం, పొరుగున్న ఏటూరునాగారం మండలంలోని రాంనగర్ నుంచి కమలాపురం వరకు నిర్మిస్తున్న రోడ్డుకు మండలంలోని బాలన్నగూడెం


బాలన్నగూడెంలో ఏర్పాటు చేసిన ఎర్రమట్టి క్వారీ

లో క్వారీ నుంచి మట్టిని తరలించేందుకు అనుమతులు ఇవ్వడంతో రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వ నిబంధనలను తుంగలోతొక్కి మట్టి తరలింపునకు అనుమతులు ఇచ్చిన రెవెన్యూ అధికారులు వారి తప్పు కప్పి పుచ్చుకునేందుకు మట్టి తవ్వకాల అనుమతి కోసం వచ్చే ఒక్కొక్కరి నుంచి రోజుకు రూ.3,000 నుంచి రూ.5,000 వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు దళారులు రెవెన్యూ అధికారుల సహకారంతో యంత్రాలతో మట్టి తవ్వకాలు జరుపుతూ అవసరమైన వారికి ట్రాక్టర్లతో తరలిస్తు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని కొందరు వ్యక్తులు తమకు తప్ప ఇంకెవరికీ అనుమతులు ఇవ్వొద్దని అవసరమైతే తాము మరో రెండు వేలు ఎక్కువగా ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీంతో ఒకరిద్దరు జేసీబీ యజమానులు మట్టి తవ్వకాలకు అనుమతికోసం


మండల కేంద్రానికి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

వెలితే లేని పోని నిబంధనలు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అధిక మొత్తంలో డబ్బులు ఇస్తేనే అనుమతి ఇస్తున్నారని వాపోతున్నారు. రెవెన్యూ అధికారులను అడిగేవారు లేకపోవడంతో వారి అక్రమ ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. మట్టి తరలింపునకు రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి పొందిన కొందరు గంపోనిగూడెంలోని చెరువులో గల ప్రభుత్వ భూములను కబ్జా చేసి అందులో మట్టిని నింపి ఇళ్లు నిర్మిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులుని వివరణ కోరగా.. రాంనగర్ రోడ్డు నిర్మాణానికి మట్టి కావాలని డీఈ లెటర్ పెట్టడంతో అనుమతి ఇచ్చామన్నారు. పట్టా భూముల యజమానులు మట్టిని అమ్ముకుంటున్నారు. అవసరమైన వారు కొనుక్కుంటున్నారని దానికి మేము ఏమిచేయాలి. మీము కాపలా ఉంటామా.. అని సమాధానం ఇవ్వడం గమనార్హం.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● ములుగు ఎమ్మెల్యే సీతక్క

కన్నాయిగూడెం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆదివారం మండలంలో సీతక్క పర్యటించిన సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్‌పాషా, మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి సీతక్క పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు 10 సంవత్సరాల్లో ఏమి చేశారని దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నారన్నారు. ప్రజలు నిత్యం సమస్యలతో అల్లాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పథకాలు పేపర్లకు తప్ప ఆచరణలో లేవని ఎద్దేవా చేశారు. కేజీ టూ పీజీ విద్య,నిరుద్యోగ భృతి, పోడు భూముల పట్టాలు, ఇంటికో ఉద్యోగం, డబుల్‌బెడ్ రూం, మొదలగు పథకాలు అమలుకు ఎక్కడా


పార్టీలో చేరినవారికి కండువా కప్పుతున్న సీతక్క

నోచుకోలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతారన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు చేరుకూరు సత్యం, మడప ముత్తయ్య, తిరుపతమ్మతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు సాయిని సాంబశివరావు, మల్లేష్, రాజేందర్, భాస్కర్, నాగమల్లయ్య, పుట్ట నవీన్, వెంకటేష్, సల్మాన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కరస్ చంద్‌గాంధీ, ఎంపీటీసీ చిట్యాల శైలజ, అరుణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, గద్దం నాగేష్, మండల యూత్ అధ్యక్షుడు నాగేష్, రాంబాబు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

ములుగు: జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో తాళం వేసిన ఇంట్లో శనివారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫల ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఇంటి యజమాని రావడంతో తప్పించుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న పినగాని శ్యాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండకు వెళ్లారు. ఇది పసిగట్టిన దొంగలు గునపంతో తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. శనివారం రాత్రి తొమ్మిది గంటల 30 నిమిషాల సమయంలో ఇంటికి చేరుకున్న శ్యాంబాబు దంపతులు ఇంట్లో లైట్లు వెలిగి ఉండడాన్ని గమనించి గట్టిగా కేకలు వేశారు. చుట్టుపక్కల ప్రజలు రావడాన్ని చూసి దొంగలు గోడ దూకి పారిపోయారు. శ్యాంబాబు 100 నంబర్‌కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సెల్‌ఫోన్, రూ.20వేలు విలువ చేసే స్మార్ట్‌వాచ్, దుస్తులు దొంగలు అపహరించారని శ్యాంబాబు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

ఘనంగా మంచినీళ్ల పండుగ


వాజేడు: వాజేడులో ర్యాలీ..


వాజేడు: పంచాయతీ సిబ్బందికి సన్మానం

వాజేడు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల దినోత్సవాన్ని మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో ప్రజలతో కలిసి అధికారులు ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, ఎంపీడీఓ విజయ, సర్పంచ్ ఆదినారాయణ, ఆర్ఐ రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాగారం గ్రామ పంచాయతీలో సిబ్బందికి శాలువా కప్పి సన్మానం చేశారు. కొంగాల పంచాయతీలో ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు.

మండల వ్యాప్తంగా..

వెంకటాపురం(కె): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా ఆదివారం మండలంలోని అన్ని పంచాయతీల్లో మంచినీటి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది, గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటి ప్రాముఖ్యతను వివరించడంతోపాటు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య


వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ర్యాలీ..

క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, వెంకటాపురం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ దేవరకొండ ధనలక్ష్మి, మరికాల సర్పంచ్ సత్యవతి, ఆలుబాక సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపురంలో సర్పంచ్ గండి కల్పన అధ్యక్షతన మంచినీళ్ల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్లెల ప్రభాకర్, ఎంపీటీసీ, అరుదుల రాధిక, గండి కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదవ రాజు, చంద్రమౌళి, ఆనందం, మంజుల, మహేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


కన్నాయిగూడెం: బహుమతి అందజేస్తున్న ఎంపీపీ

కన్నాయిగూడెం: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకుని మరింత పట్టుదలతో ముందుకెళ్లాలని ఎంపీపీ జనగం సమ్మక్క అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్రీడలు ఆదివారం ముగిశాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో చిట్యాల, ముప్పనపల్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రథమ స్థానంలో నిలిసిన ముప్పనపల్లి జట్టుకు రూ.10,016, ద్వితీయ స్థానంలో నిలిచిన చిట్యాల జట్టుకు రూ.6,016తోపాటు షీల్డ్‌ను ఎంపీపీ సమ్మక్క అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొల్లె బాస్కర్, సర్పంచ్ సూర్యనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, సుమన్, చిరంజీవి, రాంబాబు, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ విపిన్ దాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

వెంకటాపురం(ఎం): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్,


వెంకటాపురం(ఎం): క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై తాజుద్దీన్, సర్పంచ్ అశోక్

సర్పంచ్ మేడబోయిన అశోక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వెంకటాపురం పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని హైస్కూల్ వాలీబాల్ పోటీలను వారు ప్రారంభించారు. పోటీల్లో ఆరు జట్లు పాల్గొన్నట్లు ఎస్సై తెలిపారు. సోమవారం క్రీడలు కొనసాగుతాయని వెల్లడించారు. జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు, వేదవ్యాస పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు, జాగృతి నాయకుడు అంతటి రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ క్రీడలు

వెంకటపురం(కె): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వాలీబాల్ క్రీడలు ఆదివారం ముగిశాయి. స్థానిక ఎస్సై తిరుపతి రావు అధ్యక్షతన ఈ క్రీడలను నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగిన ఈ పోటీల్లో మొత్తం మండల పరిధిలోని 10 జట్లు పాల్గొన్నాయి. వీరబద్రారం టీమ్ మొదటి స్థానంలో.. నూగూరు జట్టు రెండో స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటాపురం సీఐ శివప్రసాద్ హాజరై గెలుపొందిన నగదు బహుమతితోపాటు, సీల్డులు బహూకరించారు. ఈ సందర్భంగా సీఐ శివప్రసాద్ మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఏఎస్సై పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.


వెంకటపురం(కె): బహుమతులు అందజేస్తున్న సీఐ

ములుగు రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గోవిందరావుపేట మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎస్సై కర్ణాకర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. సెమీ ఫైనల్ పోటీలను ములుగు జిల్లా కేంద్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లావుడ్య లక్ష్మీ, సమ్మయ్య, వాసం కన్నయ్య, ఎంపీడీఓ ప్రవీణ్, పీఈటీలు ఆదినారాయణ, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

రైతులు గోస పడుతుంటే దశాబ్ది ఉత్సవాలా..?

వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో పంటలు నష్టపోయి, మిగిలిన పంటను విక్రయించినా డబ్బులు రాక రైతన్నలు గోస పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా జవహర్‌లాల్ అన్నారు. ఆదివారం మండలంలోని పాలంపేటలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ధాన్యం డబ్బులను 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం నెల రోజులు గడిచినా చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వానాకాలం పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతు


మాట్లాడుతున్న జవహర్‌లాల్

వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో రైతులు, ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా కార్యదర్శి శ్రీమంతుల రవీంద్రాచారి, వీరస్వామి, నాగేశ్వర్‌రావు, రాజేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

బీసీ కులాలను మాయ చేస్తున్న బీఆర్‌ఎస్


సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కులాలను మాయ చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రఘు మాట్లాడారు. బీసీ కులాలకు రూ.లక్ష సాయానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు విధించడంతో మీసేవ కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులుకాయాల్సి వస్తోందన్నారు. నెట్ వర్క్ సర్వర్ డౌన్ ఉండడంతో అప్లికేషన్లు ఆన్లైన్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వమే కావాలని సర్వర్ డౌన్ చేసిందని ఆరోపించారు. సర్వర్ డౌన్ లోపంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సకాలంలో కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు అందక రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారన్నారు. సగటున ప్రతిరోజు 300 నుంచి 400 దరఖాస్తులు ఆన్లైన్ కావాల్సి ఉండగా ఇప్పుడు 30 నుంచి 50 వరకు అవుతున్నాయని, ఈ పథకం వల్ల సర్వర్ నెట్ వర్క్ వ్యవస్థను అదుపులో పెట్టుకొని ఆన్లైన్ కాకుండా ఆపుతున్నది ప్రభుత్వమేనని ఆరోపించారు. ఇప్పటికైనా సర్వర్ నెట్ వర్క్ వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ప్రజల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలని డి మాండ్ చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, జిల్లా మైనారిటీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి చిన్నఎల్లయ్య, మండల అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మధుబాబు, సాదారి రామయ్య, శ్రీనివాస్, హరీశ్, దుర్గం అర్జున్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ బహూకరణ


ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న తస్లీమా మహ్మద్

ములుగురూరల్: ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ తన స్వగ్రామం రామచంద్రాపురం గ్రామస్తుల కోరిక మేరకు తన తండ్రి జ్ఞాపకార్థంగా ఫాథర్స్ డే సందర్భంగా సర్వర్ చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్ బాక్సును ఆదివారం బహూకరించారు. గతంలో గ్రామానికి స్వర్గ రథాన్ని బహూకరించిన తస్లీమా ప్రస్తుతం ఫ్రీజర్ అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన ఊరికోసం సేవచేయడం అదృష్టమన్నారు. ప్రాంతానికి ఎంత చేసినా తక్కువేనని, గ్రామ రుణం తీర్చుకోలేనిదని తస్లీమా అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హట్కర్ కల్పన, రూప్‌సింగ్, ఉపసర్పంచ్ వేములపల్లి అశోక్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి, చింతనిప్పుల భిక్షపతి, గ్రామ పెద్దలు దొంతి రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, స్వామి, కోటి, నిరంజన్‌రెడ్డి, గ్రామస్తులు సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

వాజేడు: వాజేడు మండల కేంద్రంలో ఆదివారం బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టారు. ఓటరు లిస్టులో పేర్లు ఉన్నది, లేనిది పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండి ఓటరు లిస్టులో పేర్లు లేని వారి వివరాలను సేకరిస్తున్నారు.

బాధిత గొత్తికోయ కుటుంబాన్ని ఆదుకోవాలి

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

మంగపేట: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు కుమారులను కోల్పోయి తీవ్రంగా గాయపడిన మాడవి సురేష్, చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సెంటర్ వద్ద ఆదివారం ధర్నా చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెందిన మాడవి సురేష్ తన భార్య ఇద్దరు కుమారులతో ఈనెల 16న ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వస్తుండగా వారి బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు పిల్లలు చనిపోగా.. తల్లిదండ్రులు చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్య ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి శ్యాంలాల్ పాల్గొని మాట్లాడారు. సంఘటనకు కారణమైన ఆర్టీసీ సంస్థ, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలన్నారు. రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనకు ద్విచక్ర


వైఎస్సార్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

వాహనం నడుపుతున్న బాధితుడిని బాధ్యుడిని చేస్తూ.. కేసునమోదు చేయడం ఏమాత్రం న్యాయం కాదన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని వారు ఆరోపించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సమయంలో కనీసం బ్రేక్ వేయకుండా 10 మీటర్ల దూరం ఈడ్చుకుని వెళ్లిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తామన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రా కిశోర్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహారావు, నాయకులు మైబూబ్‌ఖాన్, ఉజ్వల్, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, చాద మల్లయ్య, సయ్యద్‌హుస్సేన్, యనయ్య, భగవాన్‌రెడ్డి, సురేష్, బాలయ్య, కొమరం సారయ్య, దామెర సారయ్య పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీస్ శాఖ దాడులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలోని గుడుంబా స్థావరాలపై వెంకటాపురం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయపూరి కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో జోరుగా గుడుంబా విక్రయాలు, తయారీ జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సుమారు మూడు వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయటంతోపాటు 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నాటుసారాతోపాటు, ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి రావు తెలిపారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వాజేడు: నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జెజ్జరి దామోదర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడిచిన సంవత్సర కాలంలో అధిక వర్షాల మూలంగా వచ్చిన గోదావరి వరదలకు చాలా కుటుంబాలు సర్వం కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నుంచి ఎలాంటి పునరావాసం, సహాయ సహకారాలు అందలేదని వెంటనే బాధిత కుటుంబాలకు అందించాలని అధికారులను డిమాండ్ చేశారు. రాబోయే వర్షాకాల సీజన్‌లో ముంపు ప్రాంత ప్రజలకు ముప్పు పొంచి ఉందని ముందస్తు పునరావాస చర్యలను అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రజలకు ముంపు లేని చోట ఇంటి స్థలాలను ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలను ఇచ్చి ఇళ్లు నిర్మించాలని కోరారు.

మహాసభను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఈనెల 24న జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బూర సతీష్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ఎంఎస్పీ సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వావిలాల స్వామి ఆధ్వర్యంలో బూర సతీష్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం సుదీర్ఘ కాలంగా నడుస్తున్న ఉద్యమం కీలక దశకు చేరుకుందన్నారు. ఈనెల 24న ఏటూరునాగారం మండల


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే జిల్లా మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడానికి ములుగు జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి మాదిగ, ఉప కులాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహజన సోషలిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు ములుగు మండల ఇన్‌చార్జ్ మడిపెల్లి శ్యాంబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా కన్వీనర్ పుల్లూరి కరుణాకర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ ములుగు జిల్లా కన్వీనర్ వాసంపెల్లి చైతన్య మాదిగ, నాయకులు వావిలాల సాంబశివరావు మాదిగ, దేపాక సతీష్ మాదిగ, వాసంపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.